ప్రజాశక్తి
మంగళవారం 10 జూన్ 2025

మానవ అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు

- కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి -పాడేరు: మానవ అక్రమ రవాణాకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మానవ అక్రమ రవాణా, వెట్టి చాకిరీ నిర్మూలనపై విజిలెన్స్, మోనిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వెట్టి చాకిరీ నిర్మూలన పై అవగాహన సదస్సులు నిర్వహించాలని చెప్పారు. జిల్లా నుండి ఇతర జిల్లాలకు పనులకు వెళ్లే కార్మికులను గుర్తించాలని సచివాలయం సిబ్బందిని ఆదేశించారు. మైనర్ బాలబాలికలతో పనులు చేయించకూడదన్నారు. అనంతరం కార్మిక చట్టాలపై రూపొందించిన గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, జిల్లా కార్మిక శాఖాధికారి టి. సుజాత, డిఎస్పీ షేక్ షెహబాజ్ అహ్మద్, డి ఆర్ డి ఏ పిడి వి.మురళి, జిల్లా సాంఘిక సంక్షేమాధికారి జి.జనార్ధనరావు, జిల్లా వైల్డ్ ప్రొటెక్షన్ అధికారి టి.సాధు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కులో అకారణంగా తొలగించిన

కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

- సిఐటియు, గిరిజన సంఘం ఆధ్వర్యాన రాస్తారోకో

రంపచోడవరంలో నిర్వహించిన రాస్తారోకోలో లోకనాథం తదితరులు

అరకులోయలో నినాదాలు చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-రంపచోడవరం : విశాఖ స్టీల్ ప్లాంట్‌లో అకారణంగా తొలగించిన 5,400 మంది కాంట్రాక్టు కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ సిఐటియు, ఎపి ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన సోమవారం రంపచోడవరం బస్టాండ్ జంక్షన్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర నాయకులు కె.లోకనాథం, ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికులపై నిర్బంధం ప్రయోగిస్తున్నాయని, వారిని భయభ్రాంతులకు గురిచేస్తూ ప్రైవేటీకరణ దిశగా అడుగులు వేస్తున్నాయని తెలిపారు. 20 నుండి 30 ఏళ్లుగా స్టీల్ ఫ్యాక్టరీ అభివృద్ధికి అహర్నిశలు పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులను అర్ధాంతరంగా తొలగించడం దుర్మార్గమన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు పట్టుకొమ్మలుగా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేసేందుకు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కుట్రలు చేస్తుందన్నారు. ఇందులో భాగంగానే విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కారుచౌకగా ప్రైవేటువారికి కట్టబెట్టడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రమైన ప్రయత్నాలు చేస్తున్నాయని విమర్శించారు. 32 మంది ప్రాణ త్యాగాలతో సాధించుకున్న, రాష్ట్రానికి తలమానికంగా ఉన్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేస్తే చూస్తూ ఊరుకొనేది లేదని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు ప్రైవేటీకరణ విధానాలు ఆపాలని, అకారణంగా తొలగించిన కాంట్రాక్టు కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, విశాఖ స్టీల్ ఫ్యాక్టరీకి సొంతగనులు కేటాయించాలని, కార్మికులపై నిర్బంధాలు ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్, నాయకులు నిర్మల, రామలక్ష్మి, రాజేశ్వరి, ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు, నాయకులు అశోక్, పులి సంతోష్‌కుమార్, బాలదేవ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: విశాఖ స్టీల్‌ప్లాంట్లో అక్రమంగా తొలగించిన ఐదు వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల సెంటర్లో రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిలిపివేయాలని, సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ కార్మికులు పెద్ద ఎత్తున ఉద్యమిస్తున్నారన్నారు.తెలుగుదేశం ప్రభుత్వం అధికారం రాకముందు స్టీల్ ప్లాంట్ ను రక్షిస్తామని ఎట్టి పరిస్థితుల్లో ప్రైవేటీకరణ జరగనివ్వమని ఆ పార్టీ నాయకులు ఉపన్యాసాలు ఇచ్చారని తెలిపారు. ఇప్పుడు ఆ ఉపన్యాసాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ప్రశ్నిస్తానని చెప్పిన జనసేన పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్టీల్ ప్లాంట్‌పై ఏమి మాట్లాడటం లేదని తెలిపారు. వీరంతా బిజెపికి దాసోహం అయ్యారని విమర్శించారు. స్టీల్ ప్లాంట్ ను కాపాడతామని చెపితే తెలుగుదేశం ప్రభుత్వానికి ప్రజలు ఓట్లేసి గెలిపించారన్నారు.తొలగించిన కార్మికులను విధులకు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు కొండబాబు, దున్ను, కోగేశ్వరరావు, ఐకెపి, ఆటో కార్మికులు, గిరిజన సంఘం నాయకులు రామారావు, రామన్న తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ ట్రస్ట్ అక్రమాలపై కేసు నమోదు చేయాలి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:-ఆదివాసి ట్రస్ట్ అక్రమాలపై సమగ్రంగా విచారణ జరిపి క్రిమినల్ కేసు నమోదు చేయాలని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి.సూర్యనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న అమాయక గిరిజనుల నుంచి ఐడిలు, సభ్యత్వం, విరాళాలు పేరుతో రూ 10వేలు నుంచి రూ 12200లు వరకు కట్టించుకున్నారన్నారు. చెల్లించిన డబ్బులతో సభ్యత్వం కలిగిన కుటుంబానికి నెలకు రూ 3వేల నుంచి రూ 10 వేల వరకు చెల్లిస్తానని చెప్పి మోసం చేశారన్నారు. వైద్య, మంచినీరు సదుపాయం కల్పిస్తామని మాయ మాటలు చెప్పి సుమారు రూ 100కోట్లు వసూళ్లు చేసి అమాయక గిరిజనులకు మోసం చేసిన ట్రస్ట్ చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఆస్తులు జప్తు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల అధ్యక్షుడుపాంగి డొంబు, పి వసంత కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీ చేపడుతున్న జెసి, అధికారులు

యోగాతో ఆరోగ్యం

ప్రజాశక్తి-పాడేరు టౌన్: సంపూర్ణ ఆరోగ్యానికి యోగాసనం దివ్యౌషధమని ఐటిడిఎ ఇంచార్జి పిఒ, జెసి ఎంజె అభిషేక్ గౌడ అన్నారు. ఆరోగ్యంగా జీవించడానికి యోగాసనాలను నిత్యం ఆచరించాలని పిలుపునిచ్చారు. ఐటిడిఎ కార్యాలయం నుండి అంబేద్కర్ కూడలి వరకు నిర్వహించిన యోగాంధ్రా ర్యాలీని సోమవారం ఆయన పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ముఖ్యమంత్రి పిలుపు మేరకు ఈ నెల 21న నిర్వహిస్తున్న యోగా కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని కోరారు. విశాఖలో నిర్వహించే యోగా కార్యక్రమంలో జిల్లా నుండి 25 వేల మంది విద్యార్థులు పాల్గొంటారన్నారు. మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ యోగా ఆరోగ్యదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, పరిపాలనాధికారి ఎం.హేమలత, పిడి రహీమ్, టిడబ్ల్యూ డిడి ఎల్.రజని, డిఆర్ డిఎ పిడి వి.మురళి, డిఐఒ జి.రవిశంకర్, పిఆర్ ఇఇ టి.కొండయ్య పడాల్ పాల్గొన్నారు.

గర్భిణులకు భోజనాల ఏర్పాటు

ప్రజాశక్తి -అనంతగిరి: సాధారణ రోగులతో పాటు ఆసుపత్రిలలో వైద్య సేవలు కోసం వచ్చిన గర్భిణీలకు భోజన సదుపాయం కల్పిస్తున్నామని ఆ సేవ సంస్థ అల్లూరి జిల్లా ప్రతినిధి బి.నగేష్, కార్యదర్శులు బి.జయమ్మ, అపర్ణ లు తెలిపారు. భోజన సదుపాయాలను స్థానిక వైద్య అధికారిని జ్ఞానేశ్వరి చేతుల మీదుగా అందించామని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అనంతగిరి, లుంగపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నిత్యం వైద్యం కోసం వస్తున్న రోగులతో పాటు గర్భిణీలకు భోజన సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నామని వారు తెలిపారు. అనంతగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 70 మంది గర్భిణీలకు భోజనాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ నర్స్ జయమ్మ, స్థానిక వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భోజనాన్ని పెడుతున్న వైద్యులు

విద్యుత్ పడటంతో దెబ్బతిన్న ఆటో

ఆటోపై పడిన విద్యుత్ స్తంభం

- తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలకు వెళ్లే రోడ్డు వద్ద ప్రమాదవశాత్తు సోమవారం విద్యుత్ స్తంభం ఆటోపై పడింది. దీంతో ఆటో పైకప్పు నుజ్జు నుజ్జు అయ్యింది. ఆ సమయంలో ఆటోలో ఎవరు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. వేసవి సెలవులు కావడంతో గ్రామ యువత ఎప్పటికప్పుడు ఆ ప్రదేశంలో తిరగడంతో పాటు ఆటోలో కూర్చుని ఆటలాడుకునేవారు. విద్యుత్ స్తంభం పడిన సమయంలో ఎవరు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని గ్రామస్తులు అంటున్నారు. మండల కేంద్రానికి చెందిన కే గురు కృష్ణ నిరుద్యోగ యువకుడు స్వతసిద్ధంగా ఆటో కొనుగోలు చేసుకుని తిప్పుతూ కుటుంబ పోషణ చేస్తున్నాడు. ఆటో నుజ్జు నుజ్జు కావడంతో జీవనోపాధి కోల్పోయానని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.అధికారులు, ప్రభుత్వం స్పందించి ఆటో మరమ్మత్తు చేసుకోవడానికి ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని బాధిత గిరిజనుడు కోరుతున్నాడు.

వర్షాకాలంలో ఇసుక సేకరణ నిషేధం

ప్రజాశక్తి -పాడేరు: గోదావరి ఇసుక రీచ్ల నుండి వర్షాకాలంలో ఇసుక సేకరణ నిషేదిస్తున్నామని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, జూన్ 1 నుండి అక్టోబరు 15 వరకు రుతుపవన కాలంలో గోదావరి ఇసుక రీచ్ నుండి ఇసుకను సేకరించడానికి నిలుపుదల చేస్తున్నామన్నారు. స్థానిక అవసరాలకు స్థానికంగా ఉన్న జలపాతాలు, వాగుల నుండి ఇసుక సేకరించ వచ్చున్నారు. గుండాల ఇసుక నిల్వ కేంద్రం వద్ద 1.19 లక్షల టన్నుల ఇసుక అందుబాటులో ఉందని చెప్పారు. వి.మాడుగుల, చోడవరం, కొత్తవలస (విజయనగరం) బొబ్బిలి, నర్సీపట్నం వద్ద ఇసుక నిల్వలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎం జె అభిషేక్ గౌడ, మైన్స్ సహాయ సంచాలకులు ఎం.ఆనంద్, భూగర్భ జలాల శాఖ డిడి ఎం.మురళీధర్, ఎస్ఎంఐడి.ఇ ఆర్.నాగేశ్వరరావు, గ్రామీణ నీటి సరఫరా విభాగం డి.ఇ. ఎన్ .నీలిమ పాల్గొన్నారు.

మేలైన పద్ధతులతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి- కోటవురట్ల: సమగ్ర పోషణ యాజమాన్యం పద్ధతులు అనుసరించి మేలైన దిగుబడులు పొందవచ్చునని మండల వ్యవసాయ శాఖ అధికారిని సరోజినీ అన్నారు, సోమవారం చౌడవాడ, కోటవురట్ల గ్రామలలో వికసిత కృషి సంకల్ప కార్యక్రమంలో భాగంగా రైతులకు యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన శాస్త్రవేత్త ప్రసాదరావు మాట్లాడుతూ, వరిలో విత్తన శుద్ధి చేసుకోవడంతో నారు మడి ఆరోగ్యంగా పెరుగుతుందని, అదేవిధంగా భూసారాన్ని బట్టి మేలైన వరి విత్తనాలు ఎంపిక చేసుకోవాలన్నారు. వ్యవసాయ అధికారిని మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి అమలు అవుతున్న పలు పథకాలపై రైతులకు వివరించారు.

యోగాతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

ఐటిడిఎ ఎదుట యోగాలో పాల్గొన్న పిఒ సింహాచలం

సీలేరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఆశ కార్యకర్తలు, కమ్యూనిటి హెల్త్ వర్కర్లు

ప్రజాశక్తి - రంపచోడవరం : యోగా దైనందిన జీవితంలో భాగంగా చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని రంపచోడవరం ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఐటిడిఎ కార్యాలయం ఎదురుగా వివిధ శాఖల అధికారులతో, సిబ్బందితో యోగ కార్యక్రమాన్ని నిర్వహించారు. వారితో యోగ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యోగ దినోత్సవం సందర్భంగా ప్రతి గ్రామంలో అవగాహన కల్పించే విధంగా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.అంబేద్కర్, పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, ఎపిఒ జనరల్ డిఎన్వి రమణ, డిఎల్‌డిఒ కోటేశ్వరరావు, సబ్ కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి రమణి, తహశీల్దార్ పి.రామకృష్ణ, డిప్యూటీ తహశీల్దార్ షేక్ జిలాని, ఎడిఎ సిహెచ్‌కెవి.చౌదరి, కె.సావిత్రి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఐ.శ్రీనివాసరావు, రవికుమార్, గాబ్రియల్, సుబ్బయ్య, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు చైతన్య, పి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రాజఒమ్మంగి : యోగాతో ఆరోగ్యం పెంపొందించుకోవచ్చునని ఎంపిపి గోము వెంకటలక్ష్మి ఎంపిడిఒ లోకుల యాదగిరిశ్వరరావు, సిఐ సన్యాసినాయుడు అన్నారు. సోమవారం రాజవొమ్మంగి మెయిన్‌రోడ్‌లో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో, సిబ్బందితో యోగ నిర్వహించారు. ర్యాలీ నిర్వహించారు.యోగ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మారేడుమిల్లి : మారేడుమిల్లి మండలం వనవిహారి ప్రాంగణంలో యోగాంధ్ర టూరిస్ట్ ఐకాన్ డెస్టినేషన్ కార్యక్రమం జూన్ 11 నిర్వహించనున్నామని ఎంపిడిఒ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ తెలిపారు. సోమవారం మండల స్థాయి కమిటీ సభ్యులతో కలిసి వనవిహారి ప్రాంగణాన్ని పరిశీలించి యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించడానికి అన్ని చర్యలు చేపట్టామని తెలిపారు.

సీలేరు: జికె వీధి మండలం సీలేరులో యోగాంధ్ర కోఆర్డినేటర్ స్థానిక హోమియో వైద్యాధికారి సృజనారాయ్ ఆధ్వర్యంలో యోగాపై అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఖాదర్ మస్తాన్ వల్లి, డాక్టర్ సౌమ్య, హెల్త్ సూపర్‌వైజర్ త్రినాథ, ఎఎన్ఎంలు కుమారి, దేవి, ఆశ కార్యకర్తలు, కమ్యూనిటి హెల్త్ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

వనవిహారిలో స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపిడిఒ శ్రీనివాస విశ్వనాథ్

బిర్సా ముండాకు ఘన నివాళి

ప్రజాశక్తి - రంపచోడవరం : భగవాన్ బిర్సా ముండా వర్ధంతి సందర్భంగా ఎస్టి కమిషన్ చైర్మన్ చోళ్ళ బొజ్జిరెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక రామాలయం లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భగవాన్ బిర్సా ముండా మొట్టమొదటి స్వాతంత్ర్య సమరయోధుడు, 19వ శతాబ్దపు చివరి రోజుల్లో నేటి బీహార్, జార్ఖండ్ అటవీ ప్రాంతాల్లో జరిగిన మిలినేరియన్ ఉద్యమానికి సారథ్యం వహించారని, 22 ఏళ్ల (1897) వయసులోనే బ్రిటిష్ వలసవాదంపై యుద్ధం ప్రకటించారు. ఆయన గౌరవార్ధం పార్లమెంట్‌లోని సెంట్రల్ హాల్లో ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేశారన్నారు. నేటి యువత బిర్సా ముండాను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యదర్శి కుండ్ల కృష్ణారెడ్డి, దేవీపట్నం బిజెపి మండల అధ్యక్షుడు కారం రామన్న దొర,బిజెపి మండల ప్రధాన కార్యదర్శి కుండ్ల సాయిరాంరెడ్డి, దేవీపట్నం బిజెపి మాజీ మండల అధ్యక్షులు కుంజం ముత్యాలరావుదొర, మండల న్యాయసేవాధికార సంస్థ పారాలీగల్ వలంటీరు యలగాడ నాగేశ్వరరావు, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న ఎస్‌టి కమిషన్ చైర్మన్ చోళ్ల బొజ్జిరెడ్డి

ఎస్‌టి కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న గిరిజన నాయకులు

ఎస్‌టి కమిషన్ దృష్టికి సమస్యలు

ప్రజాశక్తి - రంపచోడవరం : తన నివాసంలో ఎస్టి చైర్మన్ చోళ్ళ బొజ్జిరెడ్డి గిరిజన నేతలు, సంఘ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి, రాష్ట్రంలో ఎస్టిలు ఎదుర్కొంటున్న సమస్యలపై విస్తృతంగా చర్చించారు. జిఒ నంబర్. 3 పునరుద్ధరించేందుకు 1/70చట్టం గిరిజన ప్రాంతంలో పగడ్బందీగా అమలు చేసేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేసారు. కార్యక్రమంలో ఆదివాసీ, గిరిజన సంక్షేమ సాంస్కృతిక సంఘం అధ్యక్షులు ఆదిరెడ్డి, రంగారావు, మంగిరెడ్డి, లచ్చిరెడ్డి బొడ్డగండి పంచాయతి, మంగంపాడు కొండరెడ్డి సంఘ నాయకులు అబ్బాయిరెడ్డి, లింగారెడ్డి పాల్గొన్నారు.

అధికారులు స్వాధీనం చేసుకున్న కలప

అక్రమంగా తరలిస్తున్న కలప పట్టివేత

ప్రజాశక్తి- మారేడుమిల్లి: మండలంలోని ఆర్టీసీ బస్సులో విలువైన కలప తరలిస్తున్న సమయంలో ముందస్తుగా వచ్చిన సమాచారం మేరకు అటవీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. విలువైన రోజ్ వుడ్ మంచాలు, దివాన్‌కాట్ స్వాధీనం చేసుకున్నారు. సీలేరు నుంచి మోతుగూడెం, రాజమండ్రి వైపుగా వస్తుండగా మారేడుమిల్లిలో ఆర్టీసీ బస్సులో తరలిస్తున్న వీటిని స్వాధీనం చేసుకుని అటవీ శాఖ కార్యాలయం వద్దకు తరలించారు. అటవీ సంరక్షణయాక్ట్ కింద వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించిన అటవీ రేంజ్ అధికారి ఏడుకొండలు పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తానని తెలిపారు.

అర్జీలు స్వీకరిస్తున్న ఐటిడిఎ అధికారులు

ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 118 అర్జీలు

ప్రజాశక్తి - రంపచోడవరం : స్థానిక ఐటిడిఎ సమావేశ భవనంలో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం నిర్వహించారు. రంపచోడవరం గిరిజన సంక్షేమశాఖ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.అంబేద్కర్, ఎపిఒ జనరల్ డిఎన్వి రమణ నిర్వహించారు. ఈసందర్భంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అంబేద్కర్ మాట్లాడుతూ ఈ వారం 118 అర్జీలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, , డిఎల్ డివో కె. కోటేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఐ. శ్రీనివాసరావు,రవికుమార్, గాబ్రియేలు, సుబ్బయ్య,పిఏఓ ఎల్.రాంబాబు, ఏడిఏలు సిహెచ్ కేవీ చౌదరి, కె.సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఎన్నిక

ప్రజాశక్తి - మోతుగూడెం: అల్లూరి సీతారామరాజు జిల్లా, వై.రామవరం మండలం, డొంకరాయిలో ఆదివారం దిగువ సీలేరు డొంకరాయిలో యూఇఇయూ (సిఐటియు) ఆధ్వర్యంలో సీలేరు బ్రాంచ్ సెక్రటరీ విష్ణు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మోతుగూడెం బ్రాంచ్ సెక్రటరీ మాట్లాడుతూ స్థానిక సమస్యలపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశానికి హాజరైన యూఇఇయూ (సిఐటియు) రాష్ట్ర కమిటి సభ్యులు చింతా రాంబాబు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల పట్ల అనుసరిస్తున్న నిరంకుశత్వ వైఖరి సరైంది కాదని లేబర్‌కోడ్‌ని వెంటనే ఉపసంహరించుకోవాలని, జూలై 9న జరిగే దేశసార్వత్రిక సమ్మెకు అందరూ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కాంట్రాక్టు కార్మికులకు నూతన రీజన్ అధ్యక్షుడిగా సుభాన్, కార్యదర్శిగా చింతా రాంబాబు, కోశాధికారిగా సన్యాసిరావుని ఎన్నుకున్నారు. సమావేశానికి సీలేరు, డొంకరాయి, మోతుగూడెం, బ్రాంచ్ అధ్యక్షులు కార్యదర్శులు, పి.శ్రీను, జి.ప్రేమసన్, రమణబాబు, జగదీశ్, విష్ణు, రామారావు, హాజరయ్యారు.

వ్యాక్సిన్‌తో గర్భాశయ ముఖద్వార కేన్సర్ నియంత్రణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : తొమ్మిది నుండి 14 ఏళ్ల వయస్సు గల ఆడపిల్లలకు సెర్వావాక్ వ్యాక్సిన్ వేయడం ద్వారానే గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను నియంత్రించగలమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ రిటైర్డ్ అధికారి డాక్టర్ సరోజిని అన్నారు. చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ సంయుక్తంగా పాత పోస్టాఫీసు సమీపంలోని మత్స్యకార భవనంలో సోమవారం జర్నలిస్టుల ఆడపిల్లలకు నిర్వహించిన వ్యాక్సిన్ కార్యక్రమంను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వ్యాక్సిన్ ద్వారానే ది హ్యూమన్ పాపిలోమా వైరస్‌ను అరికట్టగలమన్నారు. చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ షిరీన్ రహమాన్ మాట్లాడుతూ వ్యాక్సిన్ కార్యక్రమంలో భాగంగా రెండు డోసులు పూర్తయ్యాయన్నారు. సీనియర్ జర్నలిస్ట్ జి.వల్లీశ్వర్ మాట్లాడుతూ చైతన్యస్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ చాలా లక్ష్యాలను సాధించి అన్ని తరగతులవారిని ఆకట్టుకుందన్నారు. జర్నలిస్టు బులుసు ప్రభాకరశర్మ, వల్లేశ్వర్, సరోజినిలను వుడా మాజీ చైర్మన్ రహమాన్, షిరీన్ రహమాన్ దంపతులు సత్కరించారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు అత్తిలి శంకరరావు, ఎపిడబ్ల్యూజెఎఫ్ విశాఖపట్నం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి. నారాయణ్, జి.శ్రీనివాస్, చైతన్యస్రవంతి ప్రతినిధులు విజయ,రుకియా భాను,లక్ష్మీ,శారద,ఉమ, దేవి,గొలగాని రవీశ్వరరావు పాల్గొన్నారు.

విశాఖలో 'రోడ్‌స్టర్ ఎక్స్ ఓలా ఎలక్ట్రిక్' డెలివరీ

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : దేశంలో అతిపెద్ద ప్యూర్‌ప్లే ఈవీ కంపెనీ ఓలా ఎలక్ట్రిక్ సంస్థ ఓలా రోడ్‌స్టర్ ఎక్స్‌పోర్ట్‌ఫోలియో మోటర్‌సైకిళ్ల డెలివరీలను సోమవారం విశాఖలో ప్రారంభించింది. ఈ సందర్భంగా ఎంవిపి కాలనీ ఓలా షోరూమ్‌లో సంస్థ ప్రతినిధి భవిష్ అగర్వాల్ మాట్లాడుతూ రోడ్‌స్టర్ ఎక్స్ రైడ్ ది ఫ్యూచర్ ప్రచారంలో భాగంగా మొదటి ఐదువేల మంది కస్టమర్లకు రూ. 10వేలు విలువైన ఆఫర్‌లనుకంపెనీ ప్రకటించిందన్నారు. వీటిలో పొడిగించిన వారంటీ, మూవ్‌ఓఎస్ ప్లస్ ఎసెన్షియల్ కేర్ భాగంగా ఉంటాయన్నారు. పనితీరు, భద్రతను పెంచే మిడ్ డ్రైవ్ మోటరుతో రోడ్‌స్టర్ ఎక్స్ సిరీస్ వస్తుందన్నారు. రోడ్‌స్టర్ ఎక్స్ సిరీస్‌లో మోటర్‌సైకిళ్లలో ఫ్లాట్ కేబుల్స్ కూడా ఉన్నాయన్నారు. ఇది పరిశ్రమలోనే మొట్టమొదటి ఆవిష్కరణ అని, ఈ కేబుల్స్ ప్యాకేజింగ్ సామర్థ్యాన్ని మెరుగుపరుస్తాయన్నారు.

అన్ అకాడమీ విద్యార్థి ఉజ్వల్ కేసరికి జెఇఇ అడ్వాన్స్‌డ్‌లో జాతీయ ఐదో ర్యాంక్

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : జెఇఇ అడ్వాన్స్‌డ్ 2025 ఫలితాల్లో విశాఖపట్నం అన్ అకాడమీ విద్యార్థి ఉజ్వల్ కేసరికి ఆల్ ఇండియా ఐదో ర్యాంక్ లభించినట్టు ఆ విద్యాసంస్థ ప్రతినిధి సుమిత్ జైన్ వెల్లడించారు. సోమవారం విద్యార్థులను అభినందించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జెఇఇ అడ్వాన్స్‌డ్ 2025 ఫలితాలో 4129 మందికి పైగా అన్ అకాడమీ విద్యార్థులు ఉత్తీర్ణులై సరికొత్త చరిత్ర సృష్టించారన్నారు. సరైన మార్గదర్శకత్వం, కృషి, సాంకేతికతతో ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చని అన్ అకాడమీ విద్యార్థులు నిరూపించారన్నారు.జెఇఇ ఫలితాల్లో అన్‌అకాడమీ 18 మంది విద్యార్థులు టాప్ 100లోపు, 787 మంది విద్యార్థులు టాప్ 5000లోనూ, 2205 మంది విద్యార్థులు టాప్ 15000 లో స్థానం పొందారన్నారు.

నా భర్త మరణంపై విచారణ జరపాలి

- గిరిజన మహిళ ఉమాదేవి

ప్రజాశక్తి -రావికమతం: మండలంలో పాత కోట్నాబెల్లి గ్రామానికి చెందిన తన భర్త ఆసరి జగదీష్ మరణం పట్ల పలు అనుమానాలు ఉన్నాయని, పూర్తిస్థాయి దర్యాప్తు జరిపించి తమకు న్యాయం చేయాలని గిరిజన మహిళ ముసలి ఉమాదేవి సోమవారం అనకాపల్లి జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్ కు ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఉమాదేవి మాట్లాడుతూ, తనకు 8 మే హిందూ సాంప్రదాయం ప్రకారం పాత కొట్నాబిల్లీ గ్రామంలో ఆసరి జగదీష్ కు తమకు వివాహం జరిగిందన్నారు. 9 మేన భార్యా భర్తలిద్దరము కలిసి సింహాచలం దేవస్థానానికి వెళ్లి రావడం జరిగిందని ఆమె తెలిపారు.

10న ఉదయం 10 గంటల సమయంలో నలుగురు వ్యక్తులు తమ ఇంటికి వచ్చి నా భర్తను తీసుకు వెళ్ళడం జరిగిందని ఆమె తెలిపారు. సాయంత్రం ఐదు గంటలకు తన భర్త బంగారం ఉంగరాలు, బైకు, చెప్పులు, తీసుకొచ్చి అందించడం జరిగిందన్నారు. ఆయన గురించి అడిగితే ఒక్కొక్కరు ఒక్కొక్క సమాధానం చెప్పడం జరిగిందని ఆమె పేర్కొన్నారు. తన భర్త రక్తపు మడుగులతో క్వారీ గొయ్యిలో శవమై ఉన్నాడని, దీనిపైన సమగ్రమైన దర్యాప్తు జరపాలని బాధితురాలు కోరింది.

జర్నలిస్టులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : జర్నలిస్టులకు తన పరిధి మేరకు నిరంతరం అండగా ఉంటానని జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి, నేవల్ డాక్ యార్డ్ కేటీబీ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు అన్నారు. ఇటీవల జర్నలిస్ట్ సుంకరి రాజా తండ్రి సుంకర పద్మనాభం, తాజాగా పూడి శ్రీనివాస్ తండ్రి రామునాయుడు మరణించగా, సోమవారం వారి కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సుంకర రాజాకు రూ.పదివేలు. పూడి శ్రీనివాస్‌కు రూ.5000, మరో సీనియర్ పాత్రికేయునికి రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించారు.

జివిఎంసి పిజిఆర్ఎస్‌కు 68 అర్జీలు

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : జివిఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు 68 వినతులు వచ్చాయని జివిఎంసి అదనపు కమిషనరు డి.వి.రమణమూర్తి తెలిపారు. ఆయా అర్జీలను పరిశీలించి పరిష్కరిస్తామన్నారు.

మహిళలపై అనుచిత వ్యాఖ్యలు తగవు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సాక్షి లైవ్ డిబేట్‌లో రాజధాని అమరావతి పై అనుచిత వ్యాఖ్యలు చేసిన జర్నలిస్టు కృష్ణంరాజు, చర్చను కొనసాగించిన కొమ్మినేని శ్రీనివాసరావు, ప్రసారం చేసిన సాక్షి ఛానెల్‌పై కఠినచర్యలు తీసుకోవాలని సోమవారం టిడిపి విశాఖ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు విల్లూరి డాక్టర్ చక్రవర్తి, జివిఎంసి 33వ వార్డు క్లస్టర్ ఇంచార్జ్ తిరుమలదేవి, టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గౌతమబుద్ధుడి ఆనవాళ్లు ఉన్న నేల అమరావతి. అలాంటి ప్రాంతాన్ని పలకడానికి ఇబ్బంది పడే పదజాలంతో చేసిన వాఖ్యలు ఆవేదనకు గురిచేశాయన్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గందా సత్య, పొట్నూరు మీనాక్షి, సింగంపల్లి మాధవి, లంకా కనకదుర్గ పాల్గొన్నారు.

కొండా రాజీవ్ గాంధీకి పరామర్శ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఇటీవల ప్రమాదానికి గురై విశ్రాంతి తీసుకుంటున్న వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీని వైసిపి విశాఖ జిల్లా అధ్యక్షుల కె.కె.రాజు సోమవారం వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, వైసిపి గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి, విశాఖ జిల్లా మహిళా అధ్యక్షురాలు పేడాడ రమణి కుమారి, కార్పొరేటర్ అనిల్ కుమార్ రాజు, సీనియర్ నాయకులు పి.సతీష్ వర్మ, శ్రీదేవి వర్మ, గాలి ప్రసాద్, తదితరులు ఉన్నారు.

కెజిహెచ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ వాణి బాధ్యతల స్వీకరణ

డాక్టర్ ఐ.వాణి

ప్రజాశక్తి- విశాఖకలెక్టరేట్: కెజిహెచ్ సూపరింటెండెంట్‌గా అదనపు డిఎంఇ క్యాడర్‌లో ప్రసూతి, స్త్రీల విభాగం ప్రొఫెసర్ డాక్టర్ ఐ.వాణి సోమవారం ఆర్థోపెడిక్స్ ప్రొఫెసర్, హెచ్ఓడి డాక్టర్ పి.శివానంద నుంచి అధికారికంగా బాధ్యతలు చేపట్టారు.కార్యక్రమానికి హాజరైన ఆసుపత్రిలోని ముఖ్య అధికారులు సిబ్బందిలో సిఎస్ఆర్ఎంఓ డాక్టర్ యు.శ్రీహరి (ఎండి హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్), అడ్మినిస్ట్రేటర్ బి.వి.రమణ, డిప్యూటీ సిఎస్ఆర్ఎంఓ డాక్టర్ జి.మెహర్ కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ డి.రాధాకృష్ణన్, డాక్టర్ వి.రవి, డాక్టర్ ఎల్.లోకనాథ్‌రావు, డాక్టర్ జి.వాసవి లత, అసిస్టెంట్ డైరెక్టర్ బి.ఎస్.సుమతితో పాటు ఇతర వైద్య, మినిస్టీరియల్ సిబ్బంది ఉన్నారు. డాక్టర్ ఐ.వాణి మాట్లాడుతూ రోగుల సంరక్షణ, ట్రీట్మెంట్ ప్రమాణాలను మెరుగుపరచడమే తన లక్ష్యమన్నారు.

క్రీడా రంగం వ్యాపారమయం

ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాంబాబు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడారంగాన్ని వ్యాపారంగా మార్చేశాయని అఖిల భారత్ యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) జిల్లా అధ్యక్షుడు వై.రాంబాబు విమర్శించారు. ఐపిఎల్ మ్యాచ్ రద్దు చేయాలని, మ్యాచ్ ల ద్వారా కార్పొరేట్ సంస్థలు, ప్రముఖ క్రీడాకారులు బెట్టింగ్ యాప్‌లకు ప్రోత్సాహిస్తూ యువతను బలి చేయడంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ దేశంలోని బెట్టింగ్ యాప్‌లు, ఐపిఎల్ బెట్టింగ్‌ల వల్ల కోట్లాదిమంది యువత జీవితాలు చిన్నాభిన్నమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బెంగళూరులో ఐపిఎల్ విజయోత్సవ సభలో జరిగిన ప్రమాదంపై విచారణ జరిపి బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె.అచ్యుతరావు, జిల్లా నాయకులు ఎస్.మధురెడ్డి, పి.శివకుమార్, మురళి పాల్గొన్నారు.

ఠాగూర్‌లో విషవాయువు లీకై ఒకరికి అస్వస్థత

ప్రజాశక్తి-పరవాడ : పరవాడ ఫార్మాసిటీలోని ఠాగూర్ లేబొరేటరీ ఫార్మా కంపెనీలో ఆదివారం రాత్రి విష వాయువులు లీకై అది పీల్చడం వలన సింహాచలం అనే కాంట్రాక్ట్ కార్మికుడు అస్వస్థతకు గురయ్యారు. సింహాచలం క్లీనింగ్ పనుల్లో భాగంగా ఎండిసి సాల్వెంట్తో క్లీనింగ్ చేస్తున్న సందర్భంలో వాయువు విడుదలై అస్వస్థతకు గురైనట్లు తోటి కార్మికులు తెలిపారు. గతంలో కూడా విషవాయువు లీకై 39 మంది అస్వస్థతకు గురయ్యారు.

సమగ్ర విచారణ చేయాలి : సిఐటియు

ఈ ఘటనపై సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకోవాలని సింహాచలం కోలుకునే వరకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన పరిశ్రమ గేటు వద్ద మీడియాతో మాట్లాడుతూ ఆయనకి వైద్య కాలంలో పూర్తిస్థాయి వేతనం చెల్లించాలన్నారు.

విద్యార్థులకు 'షైనింగ్ స్టార్స్' అవార్డులు

ప్రతిభ చాటిన విద్యార్థులతో కలెక్టర్, జెసి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి

ప్రజాశక్తి-పాడేరు : రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ పేర్కొన్నారు. విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా కష్టపడి చదివితే నూరు శాతం ఉత్తమ ఫలితాలు వస్తాయన్నారు. సోమవారం విద్యాశాఖ అధ్వర్యంలో స్థానిక పంక్షన్ హాలులో నిర్వహించిన పది, ఇంటర్మీడియట్, టెన్త్ విద్యార్థుల ప్రతిభా అవార్డుల పురస్కార ప్రధానోత్సవంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పది, ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభకనబరిచిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం నగదు బహుతి, మెడల్, ప్రశంసాపత్రాలతో సత్కరిస్తోందన్నారు. విద్యార్థులకు కేరీర్ గైడెన్స్‌పై అవగాహ కల్పిస్తామన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించి నాణ్యమైన విద్యను అందించాలన్నారు. 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన 72 మంది విద్యార్థులకు, ఇంటర్మీడియట్లో 19 మంది విద్యార్థులు ఒక్కొక్కరికి రూ. 20 వేలు చెక్కును, ప్రశంసా పత్రం, మెడల్ను అందజేసి సత్కరించారు.ఐటిడిఏ ఇంచార్జి పి ఓ, జెసి ఎం.జె. అభిషేక్ గౌడ మాట్లాడుతూ పది, ఇంటర్మీడియట్ తరగతుతు విద్యార్థుల దశ దిశ మారుస్తాయని చెప్పారు.

. పాఠశాలలో మార్గదర్శి కార్యక్రమాన్ని అమలు చేసి ఉన్నత చదువులపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. పాడేరు మాజీ శాసన సభ్యురాలు గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సకాలను సద్వినియోగం చేసుకుని సమాజంలో ఉన్నతంగా ఎదగాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు నాణ్యమైన పోషకాహారాన్ని ప్రభుత్వం అందిస్తోందన్నారు. జనసేన నేత వంపూరి గంగులియ్య ప్రసంగించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యా శాఖాధికారి పి.బ్రహ్మాజీరావు, సర్వశిక్ష ఎపిసి స్వామి నాయుడు, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఎల్. రజని, పాడేరు ఎంపిపి పొంగి రత్నకుమారి, జిసిసి డైరెక్టర్ బొర్రా నాగరాజు, ఇంటర్మీడియట్ అధికారి శంకరరావు పాల్గొన్నారు.

షైనింగ్‌స్టార్ అవార్డులు స్వీకరిస్తున్న సీలేరు, విఆర్.పురం విద్యార్థినులు

సీలేరు: సైనింగు అవార్డ్స్‌కి జీకే వీధి మండలం సీలేరు డిఎవి పాఠశాలకు చెందిన ఎండి గౌసియా, ఎస్.కె సతార్బి ఎంపికయ్యారు. వీరు కలెక్టర్ దినేష్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే గిడ్డేశ్వరి చేతుల మీదుగా అవార్డుతో పాటు మెరిట్ సర్టిఫికెట్లు పొందడం హర్షణీయమని సీలేరు డిఏవి పాఠశాల ప్రిన్సిపల్ కిరణ్‌కుమార్ వెల్లడించారు. సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 2025 పదో తరగతి పరీక్షల్లో తమ పాఠశాల విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధించి ఎఎస్ఆర్ జిల్లా జీకే వీధి మండలానికి ముగ్గురు విద్యార్థులు ఎంపిక కాగ అందులో తమ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపిక కావడం గర్వంగా ఉందన్నారు. పదోతరగతిలో ఎండి గౌస్య 600కు గాను 549 మార్కులు, ఎస్.సతార్బి 600కు గాను 540 మార్కులు సాధించారు. విద్యార్థులు అవార్డుకు ఎంపిక కావడంపై ఎపి జెన్‌కో ఎస్సీ సివిల్ ఎల్ఎంసి చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి విద్యార్థి తల్లిదండ్రులు ఉపాధ్యాయులు అభినందించారు.

విఆర్‌పురం: మండలంలో రేకపల్లి కెజిబివి పాఠశాలలో 2024-25లో ఎస్ఎస్‌సిలో ఫస్ట్ సెకండ్ మార్క్స్ సాధించిన పిట్ట నాగలక్ష్మి, కొంగ ప్రణవిలకు జిల్లా కలెక్టర్ సోమవారము షైనింగ్ స్టార్ అవార్డు అందించారు. ప్రిన్సిపాల్ వెంకమ్మ సిబ్బంది విద్యార్థులను అభినందించారు.

నవధాన్యాల సాగుతో భూసారం

ప్రజాశక్తి- మాడుగుల:నవధాన్యాల సాగుతో భూమి సారవంతంగా తయారవుతుందని జిల్లా వ్యవసాయ అధికారి బి. మోహనరావు అన్నారు. సోమవారం మాడుగుల గ్రామంలో నవధాన్యాల సాగు చేస్తున్న గండి శ్రీనివాసరావు పొలాన్ని మండల వ్యవసాయ అధికారి వాసుదేవరావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తొలకరిలో నవధాన్యాలు వేయడంతో ప్రధాన పంట కి ఎటువంటి రసాయన ఎరువులు, పురుగుమందులు వాడనవసరం లేదన్నారు. పురుగులు ,తెగుళ్ల తట్టుకునే శక్తి రావడమే కాకుండా దిగుబడి పెరుగుతుందని, ఖర్చు తగ్గుతోందన్నారు. మాడుగుల వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రయివేటు పాఠశాలలపై ఎస్ఎఫ్ఐ ఫిర్యాదు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించిన ప్రైవేట్ పాఠశాలలపై కఠినమైన చర్యలు తీసుకోవాలని సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆర్డిఓ వీవీ రమణకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ డివిజన్ ప్రెసిడెంట్ విజయ్ మాట్లాడుతూ, నర్సీపట్నంలో కొన్ని ప్రైవేటు పాఠశాలలు ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తూ, ఈనెల 12న కాకుండా వారం రోజులు ముందుగానే ఈనెల 5నుంచి పాఠశాలలను పున:ప్రారంభించారన్నారు. కాలం తీరిన బస్సులు వాడటంతో విద్యార్థులకు ప్రమాదం జరిగే అవకాశం ఉందని తెలిపారు. ప్రైవేటు పాఠశాలల తీరులో మార్పు రాకపోతే పోరాటాల చేయడానికి వెనకాడబోమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ నాయకులు కళ్యాణ్, సిద్దు పాల్గొన్నారు.

కౌలు రైతులకు పెట్టుబడి సాయం అందించాలి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: రైతులకు పెట్టుబడి సాయం అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అనకాపల్లి జిల్లా సమితి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక రెవెన్యూ డివిజన్ అధికారికి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా రైతు సంఘం జాతీయ సమితి సభ్యులు గంగాభవాని, రైతు సంఘం రాష్ట్ర సమితి సభ్యులు గురుబాబు మాట్లాడుతూ, కౌలు రైతులకు, రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయం అందించాలని కోరారు. ప్రతి ఏడాది పెరుగుతున్న సాగు ఖర్చులను దృష్టిలో ఉంచుకొని స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచి 5 లక్షల రూపాయలు సాయం అందించాలన్నారు. ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, పంటకాలువల మరమ్మత్తులకు ప్రభుత్వం తక్షణమే నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అనకాపల్లి జిల్లా కోశాధికారి కామిరెడ్డి లక్ష్మి, నర్సీపట్నం మండలం అధ్యక్షులు మాకిరెడ్డి రాజబాబు తదితరులు పాల్గొన్నారు

వెబ్ కౌన్సెలింగ్‌పై ఉపాధ్యాయ సంఘాల నిరసన

ధర్నా నిర్వహిస్తున్న ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వెబ్ కౌన్సిలింగ్‌కు వ్యతిరేకంగా ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక స్టీరింగ్ కమిటీ మెంబర్ గొంది చిన్నబ్బాయి (యుటిఎఫ్), ఎపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.రామకృష్ణారావు, ఎపిటిఎఫ్ 257 జిల్లా అధ్యక్షుడు గోపీనాథ్, కార్యదర్శి మధు శ్రీనివాసరావు, ఎస్టియు నాయకులు ఇమంది పైడిరాజు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు దాసరి నాగేశ్వరరావు, కార్యదర్శి టి ఆర్ అంబేద్కర్ మాట్లాడుతూ ఎస్‌జిటిలకు వెబ్ కౌన్సిలింగ్ వద్దని, మాన్యువల్ పద్ధతిలో కౌన్సిలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర విద్యాశాఖమంత్రి నారా లోకేష్ జోక్యం చేసుకుని తక్షణమే ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదికతో చర్చించి బదిలీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సెకండరీ గ్రేడ్ టీచర్లకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ఇచ్చిన హామీని నిలుపుకోవాలని బదిలీల విషయంలో అన్యాయం చేయాలని చూస్తే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

వర్కింగ్ జర్నలిస్టుల చట్టాలను పునరుద్ధరించాలి

ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆధ్వర్యంలో నిరసన

కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న వర్కింగ్ జర్నలిస్టులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దేశవ్యాప్తంగా వర్కింగ్ జర్నలిస్టులకు సంబంధించిన రెండు చట్టాలను కేంద్రం రద్దు చేయడం తగదని జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, విశాఖ జిల్లా అధ్యక్షులు పి.నారాయణ అన్నారు. ఆయా రెండు చట్టాలు రద్దును నిరసిస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట వర్కింగ్ జర్నలిస్టులు నల్లబ్యాడ్జీలతో శాంతియుత నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్కింగ్ జర్నలిస్టులకు సంబంధించిన చట్టం 1955లో కేంద్రం అమల్లోకి తేవడం జరిగిందన్నారు. అలాగే వేతనాలు చెల్లింపునకు సంబంధించిన చట్టం 1958 నుంచి అమలు చేయడం జరిగిందన్నారు. అటువంటి చట్టాలను 70 ఏళ్ల తర్వాత రద్దు చేయడం వల్ల జర్నలిస్టులకు తీవ్రంగా నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు. కాబట్టి కేంద్రం రద్దు చేసిన ఈ రెండు చట్టాలను తక్షణమే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాసరావు, బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టుల జిల్లా అధ్యక్షులు ఇరోతి ఈశ్వరరావు, కార్యదర్శి కె.మదన్.చిన్న మధ్య తరహాపత్రికల సంఘం అధ్యక్షుడు జగన్మోహన్, జర్నలిస్టు నేతలు శ్రీనివాసరావు, కృష్ణమూర్తినాయుడు, శ్రీనివాస్‌నాయుడు, కామన్న, కె.విశర్మ, నాయుడు,సత్య నారాయణ, శ్రీలత, మాధవి పాల్గొన్నారు.

రైతులకు త్వరితగతిన పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలో కారిడార్ రోడ్డు నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులకు త్వరిత గతిన పరిహారం చెల్లించాలని పాయకరావుపేట నియోజకవర్గం టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ కోరారు. సోమవారం సంబంధిత రైతులతో కలిసి తహసిల్దారు నరసింహమూర్తికి సమస్యను విన్నవించారు. వేంపాడు రెవిన్యూ పరిధిలో కారిడార్ రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు భూసేకరణ చేపట్టారని, పలువురు రైతులకు పరిహారం చెల్లించాల్సి ఉందని, వెంటనే పరిహారం చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

పేరు, ప్రఖ్యాతులు సాధించిన నేత గొల్ల బాబూరావు

- వైసిపి ఆత్మీయ సమావేశంలో పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షులు కెకె రాజు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని కృష్ణాకాలేజీ రోడ్డులోని పార్టీ కార్యాలయంలో వైసిపి ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షులు కెకె రాజు మాట్లాడుతూ గొల్లబాబూరావు ప్రభుత్వాధికారిగానే కాకుండా రాజకీయ నేతగా మంచి పేరుప్రఖ్యాతులు తెచ్చుకున్నా రన్నారు. ఉత్తరాంధ్రకు ముఖ్యంగా విశాఖపట్నానికి కూటమి ప్రభుత్వం చేస్తున్న అన్యాయాన్ని పార్లమెంటు సాక్షిగా ప్రశ్నించాలని కోరారు. అనంతరం ఎంపీ బాబూరావు మాట్లాడుతూ. కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని, మీలో ఒకటిగా నిలుస్తానని అన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్తు చైర్మన్ జల్లపల్లి సుబ్రద, శాసన మండలి సభ్యులు కుంభ రవి బాబు , వరుదు కళ్యాణి, సమన్వయ కర్తలు వాసుపల్లి గణేష్ కుమార్ , తిప్పల దేవన్‌రెడ్డి, మొల్లి అప్పారావు, మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి , తైనాల విజయ కుమార్, తిప్పల గురుమూర్తి రెడ్డి, మాజీ నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి , డిప్యూటీ మేయర్ కోటమూరి సతీష్, రవి రెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ కోతలతో అవస్థలు

ప్రజాశక్తి -కోటవురట్ల: అసలే ఉక్కపోత తో అల్లాడుతున్న మండల వాసులకు, విద్యుత్ శాఖ అధికారుల అనధికారిక కరెంట్ కోతతో ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన చెందుతున్నారు. మండల కేంద్రంలో సోమవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి 4 గంటల వరకు విద్యుత్ కోత విధించారని, పలుమార్లు విద్యుత్ అధికారులకు తెలియజేసినా పట్టించు కోలేదని స్థానికులు తెలిపారు.ప్రతినిత్యం ఇదే పరిస్థితి ఎదురవుతుందని, నాణ్యమైన విద్యుత్తును అందజేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడుతున్నారు. అప్రకటిక కోతలకు చెక్‌చెప్పాలని కోరుతున్నారు.

నేడు పాడేరులో కాఫీ రైతుల సమావేశం

పాలక లక్కు

ప్రజాశక్తి -పాడేరు : అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో ఈనెల 10న మంగళవారం కాఫీ రైతుల సమావేశం నిర్వహిస్తున్నట్లు కాఫీ ఫార్మర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (సిఎఫ్ఎఫ్ఐ) జాతీయ సభ్యుడు పాలికి లక్కు సోమవారం స్థానిక విలేకరులకు తెలిపారు. 11 మండలాల్లో ఉన్న కాఫీ రైతుల సమస్యలు, మార్కెటింగ్ ధరలు తదితర అంశాలపై చర్చించేందుకు ఈ సమావేశాన్ని పాడేరులోని ఆదివాసి గిరిజన సంఘం ఆవరణలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి మండలం నుంచి ఐదు మంది చొప్పున రైతుల్ని ఈ సమావేశానికి ఆహ్వానిస్తున్నామని ఇప్పటికే అన్ని మండలాల నుంచి ముగ్గురు చొప్పున కాఫీ రైతులను సమావేశంకు ఆహ్వానించడం జరిగిందని తెలిపారు. ఈ సమావేశానికి సిఎఫ్ఎఫ్ఐ జాతీయ నాయకులు హాజరవుతున్నారని తెలిపారు.

సాగు పద్ధతులపై రైతులకు శిక్షణ

శిక్షణకు హాజరైన రైతులు

ప్రజాశక్తి -హుకుంపేట: భారతీయ వ్యవసాయ మంత్రిత్వ శాఖ, భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి ఆధ్వర్యంలో సిల్క్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం మట్టుజోరు గ్రామంలో సోమవారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా రైతుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న వివిధ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. రైతులు పాటించవలసిన యాజమాన్య చర్యలు, భూసార పరీక్షల ప్రాధాన్యత, ఎరువుల యాజమాన్యం పై సమగ్రమైన శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సాంబ, గ్రామ సర్పంచ్ సరిత తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

ప్రజాశక్తి-హుకుంపేట:మండలంలోని తడిగిరి పంచాయతీ శివారులో పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను సోమవారం అరెస్ట్ చేశామని స్థానిక ఎస్సై సూర్యనారాయణ తెలిపారు. పోలీసులు చేపట్టిన సోదాల్లో వారి వద్ద నుండి రూ. 2,700 నగదు స్వాధీనంగా చేసుకున్నామన్నారు. జూదం వంటి చెడు వ్యసనాలకు అలవాటు పడటంతో కుటుంబ వ్యవస్థలు నాశనం అవుతుందని హెచ్చరించారు. నేరాల నుంచి దూరంగా ఉండాలని యువతకు సూచించారు.

మహిళా డిగ్రీ కళాశాలను సందర్శించిన 'ఇగ్నో' బృందం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (ఎ)లో ఉన్న ఇగ్నో లెర్నర్ సపోర్టు సెంటర్‌ను సోమవారం మృత్యుంజయబెహరా, జాయింట్ సెక్రటరీ, ఎకనామిక్ అడ్వైజర్ డిపార్టుమెంట్ ఆఫ్ హైయ్యర్ ఎడ్యుకేషన్, మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ వారు సందర్శించారు. ఈ సెంటర్ పనితీరును ఎకడమిక్ కౌన్సిలింగ్ సెషన్, కార్యకలాపాలను పరిశీలించి స్టడీసెంటర్ పనితీరును అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల, కళాశాలలో అధ్యాపకుల వివరాలు కోర్సులు, విద్యా విధానంలో తీసుకురావాల్సిన మార్పులపై చర్చించారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.ఎల్ శిరీష, సీనియర్ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ డి.ధర్మారావు, ఇగ్నో డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఇ.కృష్ణారావు, అసిస్టెంట్ జి.వి.సుబ్బారావు, సిబ్బంది వి.రామచంద్రరాజు, వై.జగన్నాథం. ఎస్.ఆదిలక్ష్మి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మల్టీ టాలెంటెడ్ ఉమెన్ అల్మా బెరక

సిపి చేతుల మీదుగా అవార్డు స్వీకరణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నగరానికి చెందిన గురిందపల్లి అల్మా బెరెక మల్టీ టాలెంటెడ్ ఉమెన్, బెస్ట్‌సింగర్ అవార్డు పొందారు. సోమవారం నగరంలోని ఒక హోటల్లో జరిగిన కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చీ చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. అన్ సంగ్ హీరోస్ ఆఫ్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. అల్మా బెరెక బెస్ట్ ఫ్యాషన్ అఛీవర్ - 2025, మిస్సెస్ తెలంగాణ- 2024, బెస్ట్ టాలెంట్ ఇన్ మిస్సెస్ ఇండియా-2024, బెస్ట్ రాంప్ వాక్ ఇన్ మిస్సెస్ ఇండియా-2024, బ్రైడ్స్ ఆఫ్ ఇండియా 2024 (రన్నర్‌అప్) ఫ్యాషన్ రంగంలో ఆమె సాధించిన కొన్ని అవార్డులు. ఆమె అద్భుతమైన సింగర్, మంచి మనసున్న వ్యక్తి అని పలువురు వక్తలు కొనియాడారు.

యుగంధర్‌పై చర్యలు తీసుకోవాలి

- డివైఎఫ్ఐ డిమాండ్

మాట్లాడుతున్న డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాజు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఉద్యోగాల పేరిట మోసం చేసిన సనపల యుగంధర్‌పై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ నాయకులు సోమవారం పోలీస్ కమిషనర్‌కు సమర్పించిన వినతిపత్రంలో కోరారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు యు.ఎస్.ఎన్‌రాజు మాట్లాడుతూ విశాఖ ఎండాడలో ఎస్.యుగంధర్ ఉద్యోగాలు ఇస్తామని కె.గణేష్, పి.లక్ష్మి, కె.ఆదిలక్ష్మి దగ్గర నుంచి రూ.19.40 లక్షలు వసూలు చేసి మోసం చేశాడని తెలిపారు. సనపల యుగంధర్ కలెక్టర్ కార్యాలయంలో ఆఫీస్ అసిస్టెంట్ ఉద్యోగాలు ఇప్పిస్తామని, బాధితులకు చెప్పి ఆఫర్ లెటర్ కూడా చూపించి మోసం చేసారన్నారు. మోసపోయిన బాధితులు తిరగబడటంతో పరారయ్యాడని చెప్పారు. నిందితుడు యుగంధర్‌పై పలు రకాల చీటింగ్ కేసులు ఉన్నాయని, జైలుకు సైతం వెళ్లి వచ్చాడన్నారు. బాధితులకు డబ్బులు రికవరీ చేసేలా పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు.

పరిహారం చెల్లించకుండా చెట్లు తొలగించొద్దు!

అధికారులను అడ్డుకున్న నిర్వాసితులు, సిపిఎం నేతలు

ప్రజాశక్తి- నక్కపల్లి:మండలంలో రాజయ్యపేటలో వైజాగ్ -చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా బల్క్ డ్రగ్స్ పార్క్ ఏర్పాటుకు సేకరించిన డి పట్టా, సాగు భూముల్లో జీడి, కొబ్బరి చెట్లను ఏపీఐసీ, రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో సోమవారం సిఐ కుమారస్వామి ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు నడుమ యంత్రాలతో చెట్లు తొలగింపు పనులు చేపట్టారు. విషయం తెలుసుకున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు, మత్స్యకార నాయకుడు పిక్కి శ్రీనివాసరావు సాగుదారులతో కలిసి చెట్లు తొలగింపును అడ్డుకున్నారు. ఈ సమయంలో నాయకులు, పోలీసుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ 2013 భూ సేకరణ చట్టం ప్రకారం డి ఫారం భూముల్లో గల చెట్లకు, సాగు భూములకు, ఆ భూముల్లో ఉన్న తోటలకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే అనేకసార్లు చెట్లకు పరిహారం చెల్లించాలని అధికారులను కోరడం జరిగిందని, హామీ ఇచ్చి, నేటి వరకు పరిహారం చెల్లించలేదన్నారు. పరిహారం చెల్లించకుండా తోటలను ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు. పోలీసుల బందోబస్తు నడుమ చట్టాలను ఉల్లంఘించి దౌర్జన్యంగా తోటలను నేలమట్టం చేయడం చట్ట ఉల్లంఘనే అవుతుందన్నారు. సమస్యను పరిష్కారం చేయకుండా తోటలను తొలగిస్తే సాగుదారులతో కలిసి అడ్డుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సాగుదారులు వాసుపిల్లి శివ, చోడిపల్లి రాజు, చోడిపల్లి వసంతమ్మ, అధికారులు పాల్గొన్నారు.

ఎండిఎం నిర్వాహకులకు శిక్షణ

ప్రజాశక్తి -నక్కపల్లి:స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం మండలంలో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులతో ఒకరోజు శిక్షణ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా భోజన పథకం నిర్వాహకులు తయారు చేసిన వివిధ రుచికరమైన వంటకాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎంఈఓ నరేష్ మాట్లాడుతూ, మెనూ ప్రకారం ప్రతిరోజు విద్యార్థులకు మంచి ఆహారం అందజేయాలన్నారు. గ్యాస్ స్టవ్ లపై మాత్రమే వంట చేయాలన్నారు.వంట చేసే పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పతివాడ విజయ, సీ.ఆర్.పీ.లు అప్పారావు, శేఖర్, గంగేశ్వరరావు, దేవి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.